

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.159	231	261
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.159	231	262

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 24.6



సూర్య..@ 43.5 డిగ్రీలు

● భానుడి ప్రతాపంతో ప్రజలు విలవిల ● తీవ్రమవుతోన్న వడగాడ్పులు

● నల్లగొండ జిల్లా నిడమనూరులో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత

యాదాద్రి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎండలు దారెత్తిస్తున్నాయి. ఇంటినుంచి బయటకు వెళ్లాలంటే ప్రజలు ఎండవేడిమికి వణికిపోతున్నారు. మరోవైపు సీజన్ వ్యాధులు ప్రజలపై విజృంభిస్తున్నాయి. ఎండతోపాటు సీజనల్ వ్యాధులకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. గురువారం అత్యధికంగా నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేట, నిడమనూరులో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బొమ్మలరామారం మండలం మర్యాలలో అత్యధికంగా 42.6, వలిగొండ మండలం వర్కట్‌పల్లిలో అత్యల్పంగా 38.1డిగ్రీలు, సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెంలో అత్యధికంగా 42.6 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తిలో 37.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సామాన్యులు

మండుతున్న ఎండలకు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. బంధువుల పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు వెళ్లేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు ఎండనుంచి రక్షణ పొందేందుకు రుమాలు కట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ సారి ఏప్రిల్ ఆరంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు మండుతుండటంతో వ్యవసాయ, ఇతర కూలీ పనులకు వెళ్లే వారు తంటాలు పడుతున్నారు. ఎండవేడిమికి వడదెబ్బ భయం కూడా పట్టుకోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



యాదగిరికొండపై పరుగులు తీస్తున్న భక్తులు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

ఎండవేడిమి నుంచి జాగ్రత్తగా ఉంటేనే మేలు అని వైద్యులు పేర్కొంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో వడదెబ్బ బాధితులు పెరిగే అవకాశం ఉంది. ఎండలతోపాటు సీజనల్ వ్యాధులూ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. మండుతున్న ఎండల మాదిరిగానే వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వారం రోజులుగా ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. చిన్నారులు జ్వరాల బారిన పడే అవకాశం ఉన్నందున.. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం, ఎండలో ఎక్కువగా తిరగడం, సమయానికి తినకపోవడం తదితర కారణాల వల్ల సీజనల్ వ్యాధులు అధికంగా సంక్రమించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



యాదగిరిగుట్టలో ఎండలనుంచి కాస్త ఉపశమనం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతోపాటు శివాలయాన్ని కృష్ణరాతి శిలలతో పునర్నిర్మించారు. దీంతో ఎండవేడిమికి భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. అయితే ఈ వేసవిలో కొండపైన ఎండవేడిమి తట్టుకునేందుకు ఆలయ అధికారులు చలువ పందిళ్లతోపాటు మాడవీధుల్లో అత్యాధునికంగా జర్మనీ హాంగర్స్ ఫ్యాబ్రిక్ సహాయంతో షెడ్డును ఏర్పాటుచేశారు. దీంతో భక్తులకు ఎండవేడిమి నుంచి ఉపశమనం కలగనుంది.



ఆశలు ఆవిరి
ఎవుసానికి ఏది దారి

● డెడ్‌స్టోరేజీకి చేరువలో నాగార్జునసాగర్ ● రాష్ట్ర విభజన అనంతరం రెండోసారి క్రాప్‌హాలిడే ● లక్ష్యం నెరవేరని ఏఎమ్మార్పీ ● అడుగంటిన మూసీ, శాలిగౌరారం ప్రాజెక్ట్ నీటి మట్టాలు

జిల్లా రైతుల వెన్నులో వణుకుపుడుతోంది. అప్పులు తెచ్చి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు ఎండుతుంటే.. కన్నీటి ధార ఏరులై పారుతోంది. ఆరుగాలం కష్టం అగ్నికి ఆహుతవుతుంటే గుండె చెరువై, బతుకు భారమవుతోంది. సకాలంలో వర్షాలు లేక, ప్రాజెక్ట్‌ల్లో నీరు అడుగంటి.. అరకొర పంటలు సాగు చేస్తే.. కరువు కరాళ నృత్యం చేసి.. ఎవుసాన్ని ఎడారిగా మార్చింది. సకాలంలో ఆదుకుంటాయనుకున్న ప్రాజెక్ట్‌లు నేడు అడుగంటి ఆపదలో పడ్డాయి. తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ నాగార్జునసాగర్ డెడ్‌స్టోరేజీకి దగ్గరలో ఉంది.

నాగార్జునసాగర్, ఏప్రిల్ 4: తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ ఆపదలో పడింది. అందరికీ అన్నం పెట్టిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం డెడ్‌స్టోరేజీకి 2.00 అడుగుల దూరంలో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 512.10 అడుగులుగా ఉంది. పూర్తి సామర్థ్యం 312.5050 టీఎంసీలు కాగా, ప్రసుత్తం 135.2629 టీఎంసీలుగా ఉంది. రాష్ట్ర విభజన అనంతరం 2015లో యాసంగికి మొదటిసారి క్రాప్‌హాలిడే ప్రకటించగా రెండోసారి ఈ ఏడాది క్రాప్‌హాలిడే ప్రకటించారు. సాగర్ నీటిమట్టం గత ఏడాది ఇదే రోజున 530.10 అడుగులుగా ఉంది. గత ఏడాదికంటే ఈ ఏడాది సాగర్ నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరువలో ఉండడంతో భూగర్భజలాలు తగ్గి బోర్లు, బావుల్లో నీరులేక ఆయకట్టులో పొలాలు ఎండిపోయాయి.

తాగునీటికే పరిమితమైన ఏఎమ్మార్పీ

దేవరకొండ: సాగు, తాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ) లక్ష్యం నెరవేరడం లేదు. నల్లగొండ జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు హైదరాబాద్ జంట నగరాలకు, జిల్లాలోని 516 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రాజెక్టు చేపట్టారు. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు తాగునీటి సరఫరాకే పరిమితమైంది. పూర్తిస్థాయిలో సాగునీరు అందించని దుస్థితి. రూ.1250 కోట్లతో 2001లో ప్రాజెక్టును ప్రారంభించగా నాలుగు మోటార్ల ద్వారా 1,800 క్యూసెక్కుల సాగు, తాగునీరు అందించాల్సి ఉంది. కానీ నాగార్జునసాగర్‌లో సమృద్ధిగా నీరులేకపోవడం, ఏఎమ్మార్పీ సిస్టర్న్‌తో పాటు ప్రధాన కాల్వలు దెబ్బతినడం, నీటి లీకేజీతో సాగునీటి సరఫరాకు అడ్డంకిగా మారాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 512.10 అడుగులకు చేరుకుంది. దీంతో ఏఎమ్మార్పీ నుంచి హైదరాబాద్ జంటనగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్‌భగీరథ ద్వారా జిల్లాలోని గ్రామాలకు 50 క్యూసెక్కులనీరు ప్రతి రోజూ సరఫరా చేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాలు కురవకపోవడం, సాగర్‌లో నీరులేకపోవడంతో ఏఎమ్మార్పీ ప్రాజెక్టు తాగునీటికే పరిమితమైందే తప్ప సాగుకు నోచుకోని దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022-23 సంవత్సరానికిగాను ఏఎమ్మార్పీ ప్రాజెక్టు కింద రెండు పంటలకు వారబంధి పద్ధతిలో లక్షా 50వేల ఎకరాల వరకు సాగునీరు అందించారు. కానీ ఈ ఏడాది సాగర్ నీరు తాగునీటికే పరిమితమైంది.

డిండి ప్రాజెక్టుదీ అదే పరిస్థితి

నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దులో డిండి జలాశయం ఉంది. 1941 - 43లో దుందుభి వాగుకు అడ్డంగా డిండి ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు కింద 12,500 ఎకరాలు ఆయకట్టు ఉంది. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 36 అడుగులు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా వరద నీరు డిండి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి కాల్వల ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలోని చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేస్తారు. కల్వకుర్తి ప్రాజెక్టు నీరు డిండి ప్రాజెక్టులోకి చేరుకుంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 30 అడుగుల మేర నీరుంది. 2022-23లో డిండి ప్రాజెక్టు నీటిని ఖరీఫ్ పంటకు విడుదల చేశారు. 12వేల ఎకరాల వరకు రైతులు సాగు చేసుకున్నారు. కానీ ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టు నీటిని విడుదల చేయలేదు. ప్రస్తుతం ప్రాజెక్టులో 30 అడుగుల నీరు నిల్వ ఉంది. డిండి ప్రాజెక్టు నీటిని తాగునీటి అవసరాలకు కాల్వల ద్వారా విడుదల చేయాలని చందంపేట, నేరేడుగొమ్ము మండలాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గత పదేళ్లలో సాగర్ ఆయకట్టు నీటి వివరాలు

సంవత్సరం	నీటి విడుదల తేదీ	నీటిమట్టం
2014	డిసెంబరు 11	558.70
2015	క్రాప్ హాలిడే	-
2016	డిసెంబరు 5	526.40
2017	డిసెంబరు 11	558.10
2018	డిసెంబరు 27	548.10
2019	డిసెంబరు 16	578.80
2020	డిసెంబరు 7	588.60
2021	డిసెంబరు 16	586.00
2022	డిసెంబరు 6	586.00
2023	క్రాప్ హాలిడే	-

పునఃప్రారంభమైన డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు

డిండి: ఎత్తిపోతల రిజర్వాయర్ల పనులు ఇటీవల పునఃప్రారంభమయ్యాయి. 2015లో డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసి రెండున్నరేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేసి సాగు, తాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. అందుకుగాను ప్రాజెక్టు వ్యయం రూ.6190 కోట్లు కేటాయించారు. కానీ భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం ప్రక్రియ పూర్తికాకపోవడంతో ప్రాజెక్టు పనులను భూనిర్వాసితులు తరుచూ అడ్డుకుంటుండటం, ప్రాజెక్టుకు అనుమతిలేదని కోర్టులో కేసు వేయడంతో పనులు కొంతకాలంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపడుతోంది. డిండి ఎత్తిపోతల పథకంలో చింతపల్లి, శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, గోకారం, ఉల్పర, ఇర్విన్ ప్రాంతాల్లో రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు. వీటిలో గొట్టిముక్కల, సింగరాజుపల్లి రిజర్వాయర్ల పనులు 95శాతం పూర్తయ్యాయి. చర్లగూడెం రిజర్వాయర్ పనులు 65శాతం పూర్తయ్యాయి. చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్‌లు 35శాతం పూర్తయ్యాయి. మిగతా వాటి పనులు కొనసాగుతున్నాయి.

గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలో 200 ఎకరాలకు, చర్లగూడెం రిజర్వాయర్ పరిధిలో 200 ఎకరాల వరకు భూపరిహారం చెల్లించాల్సి ఉంది. కాగా గొట్టిముక్కల రిజర్వాయర్ కింద ఇళ్లు కోల్పోతున్న పూతల్‌రాంతండా, లింగన్నబావి భూనిర్వాసితులకు చింతపల్లి వద్ద పునరావాసం కల్పించారు. వెంకేపల్లి, వెంకేపల్లితండా, చర్లగూడెం, శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ పరిధిలో లక్ష్మణాపురం, ఈదులగండి ముంపు గ్రామాల బాధితులకు పునరావాసం కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

గత ఏడాదికన్నా మూడు అడుగుల దిగువకు..

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు ప్రస్తుతం నీరు అడుగంటి వెలవెలబోతోంది. యాసంగిలో ఆయకట్టులోని 35వేల పైచిలుకు ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు ప్రతి ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే రుతుపవనాలు, తుఫాను వర్షాలకు పొంగిపొర్లేది. మూసీ నదీ పరివాహక ప్రాంతాల్లో వేసవిలో కురిసే వర్షాలు, హైదరాబాద్‌నుంచి నిరంతరాయంగా వచ్చే డ్రైనేజీ నీటితో వేసవిలోనూ ఇన్‌ఫ్లో కొనసాగేది. దీంతో వానాకాలం నాటికి ఈ ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటూ వచ్చేది. దీంతో గత వానాకాల సీజన్‌లో సైతం ప్రాజెక్టు ఆయకట్టులో పంటల సాగుకు నీటిని విడుదలచేశారు. అనంతరం గత డిసెంబరులో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు యాసంగి పంటల సాగుకు అధికారులు వారబందీ పద్ధతిన నీటిని విడుదల చేశారు. దీంతో 34 కిలోమీటర్ల పొడవున ప్రవహించే మూసీ కుడికాల్వ ద్వారా నకిరేకల్ నియోజకవర్గంలోని కేతేపల్లి మండలంలో తొమ్మిది గ్రామాలు, మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి మండలంలో ఏడు గ్రామాలు, నల్లగొండ నియోజకవర్గంలోని తిప్పర్తి మండలంలో రెండు గ్రామాల పరిధిలో 14,770ఎకరాలకు, 42 కి.మీ.ల పొడవు ప్రవహించే ఎడమ కాల్వ ద్వారా సూర్యాపేట నియోజకవర్గంలోని చివ్వెంల మండలంలో రెండు గ్రామాలు, పెన్‌పహాడ్ మండలంలో మూడు గ్రామాలు, సూర్యాపేట మండలంలో 16 గ్రామాల పరిధిలో 15,230ఎకరాలకు సాగునీటిని సరఫరాచేశారు. యాసంగి సీజన్ పూర్తవడంతో గత నెల 25న ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు సాగునీటి విడుదలను నిలిపివేశారు. నీటి విడుదల నిలిపి వేసే నాటికి 620.55అడుగులు (0.501 టీఎంసీ)గా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతుండగా నీటిమట్టం 625.40 అడుగులు(0.88టీఎంసీ)లుగా ఉంది. గత అక్టోబరు, నవంబరులో వర్షాల్లేక ప్రాజెక్టులోకి వరద నీరురాలేదు. ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని ఆయకట్టులో పంటల సాగుకు విడుదల చేయడంతో 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి సామర్థ్యంగల ప్రాజెక్టులో ప్రస్తు తం నీటిమట్టం 618.23(0.391టీఎంసీలు)అడుగులకు పడిపోయింది.

అడుగంటిన నీటితో శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం: జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు అడుగంటిన నీటితో బోసిపోయింది. గత ఏడాది నీటితో నిండుగా ఉన్న ప్రాజెక్టు వర్షాభావ పరిస్థితులతో పాటు నీటిపారుదల అధికారుల నిర్లక్ష్యంతో కళతప్పింది. ప్రతీ ఏడాది యాసంగి, వానాకాలం సీజన్లకు రెండు ప్రధాన కాల్వల ద్వారా దాదాపు ఐదు వేల ఎకరాలకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యంతో ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రాజెక్టు మరమ్మతుల పేరిట మూసీ నది పల్లివాడ ఆనకట్ట వద్ద ప్రాజెక్టులోకి నీరు రాకుండా అధికారులు అడ్డుకుంటున్నారు. దీంతో గత జూలై, ఆగస్టు మాసంలో వర్షాలు బాగా పడి మూసీ నది ప్రవహించినా శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరును వదలలేదు. ఫలితంగా ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు లేకుండా పోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం 2 అడుగుల నీరు మాత్రమే ఉంది.

నత్తనడకన 'నృసింహ' పునరావాస పనులు

● ముగిసిన గడువు ● కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనుల్లో ఆలస్యం ● ఆందోళనలో లబ్ధిదారులు ● త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ ● ప్రాజెక్ట్ వద్ద నిర్వాసితుల ఆందోళన






కొనసాగుతున్న నిర్మాణ పనులు, (ఇన్‌సెట్)లో ముంపునకు గురైన లప్పానాయక్ తండా

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 4: బస్వాపురం రిజర్వాయర్ (నృసింహసాగర్ ప్రాజెక్టు) నిర్వాసితుల పునరావాస పనులు నత్తనడకలు నేర్చుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ పరిధిలో లప్పానాయక్ తండా పూర్తిగా ముంపునకు గురైంది. అయితే వీరికి పునరావాసం కల్పించాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదేశించింది. వీరికి మండలంలోని దాతరుపల్లి గ్రామంలోని సర్వే నెం.294లో 306 మంది లబ్ధిదారులకు 30.11 ఎకరాల భూమిని కేటాయించింది. మాజీ సీఎం కేసీఆర్ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా మొత్తం రూ.28కోట్లు కేటాయించి, అందులోనే నీటి సౌకర్యం, రోడ్లు, విద్యుత్, మురుగుదొడ్లు, మౌలిక వసతులు కల్పించే విధంగా పనులు చేపట్టాలని పూర్తిగా నిధులు కేటాయించారు. దీంతో నాటి ఎమ్మెల్యే గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గత అక్టోబరులో పునరావాస పనులు ప్రారంభమయ్యాయి. 2024 ఫిబ్రవరిలోపు అన్ని వసతులతో స్థలాన్ని తీర్చిదిద్ది, ఇంటి నిర్మాణానికి అనుగుణంగా ఇచ్చేందుకు కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నెలల తరబడి పనులు సాగుతూనే ఉన్నాయి. దీంతో లబ్ధిదారులు తాము ఎప్పుడు ఇళ్లు నిర్మించుకోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పనులు పూర్తి కావాలంటే మరో ఆరునెలల సమయం పడుతుందని పేర్కొన్నారు. అయితే అప్పటికే వర్షాకాలం ఆరంభమవుతుందని, రిజర్వాయర్ పూర్తిగా నీటి నిండి జలమయమవుతోందని, తమ పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పనులపై దృష్టి కేంద్రీకరించి తక్షణమే స్థలం చదును చేసి ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు నిర్వాసిత ప్రాంతం వద్ద గురువారం ధర్నాకు దిగారు.

వర్షాలు కురిస్తే ఇళ్లు కట్టుకోలేం



వర్షాలు ఇస్తే ఇళ్లు కట్టుకోలేం. ఇంకా ఎన్ని రోజులు ఆగాలి. ఇప్పటికే చాలా రోజులుగా ఎదురు చూస్తున్నాం. త్వరగా పనులు పూర్తిచేసి ఇవ్వాలి. కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలి.

బుజ్జి శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్, లప్పానాయక్‌తండా

ధాన్యం రవాణాకు ఆటంకాలు ఉండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

● అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 4: కొనుగోళ్లు చేసిన యాసంగి ధాన్యాన్ని సమయంలోపు తరలించేందుకు రవాణాకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు ముందస్తుగానే తీసుకోవాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి. బెన్ షాలోమ్ రవాణా కాంట్రాక్టర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన రవాణా కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ సీజన్ ప్రారంభమైనందున రవాణా కాంట్రాక్టర్లు కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు ముందుగానే తరలించాలన్నారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ఉపేక్షించబోమన్నారు. ఏ విధమైన సమస్యలు కలిగిన వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమీక్షలో పౌరసరఫరాల మేనేజర్ గోపీక్రిష్ణ, డీఎస్వో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దతు ధర పొందాలి

చౌటుప్పల్ టౌన్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని చౌటుప్పల్ ఆర్డీవో వి.శేఖర్ రెడ్డి కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు ఎస్.లింగోటం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆర్డీవో ప్రారంభించి మాట్లాడారు. ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,203, బీ-గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,183గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అంతకుముందు ఓపీవోలకు ఒక రోజు శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, ఏవో ముత్యాల నాగరాజు, ఏఎంసీ సెక్రటరీ వి.రవీందర్‌రెడ్డి, ఎన్‌డీసీసీ బ్యాంక్ మేనేజర్ వి.రజిత, పీఏసీఎస్ సెక్రటరీ రమేష్ పాల్గొన్నారు.

ఒంటరి కుటుంబానికి అండగా..

● ఆర్థికసాయం చేసిన మంత్రి వెంకట్‌రెడ్డి



కోమటిరెడ్డిని కలిసిన లావణ్య, చిన్నారులు

మోత్కూరు, ఏప్రిల్ 4: ఒంటరి కుటుంబాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అక్కున చేర్చుకున్నారు. వివరాల్లోకి వెళితే... మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన మామడి సత్యనారాయణ-లావణ్యలకు ముగ్గురు సంతానం. సత్యనారాయణ బ్రెయిన్ స్ట్రోక్‌తో అనారోగ్యం బారిన పడ్డాడు. లావణ్య తమకు ఉన్న ఆస్తులన్నీ విక్రయించి అతని చికిత్సకు ఖర్చు చేసింది. అయి నా భర్త దక్కలేదు. దీంతో ఆ కు టుంబం పెద్దదిక్కును కోల్పోయి రో డ్డున పడింది. ఆమె గురువారం నేరుగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంటికి వెళ్లింది. ముగ్గురు చిన్న పిల్లలతో వచ్చిన ఆ తల్లిని చూసి మంత్రి వెంకట్‌రెడ్డి ఆరా తీయగా, ఆమె తన కుటుంబ పరిస్థితిని వివరించింది. తన చేతిలో చిల్లిగవ్వ లేదని, ముగ్గురు పిల్లలను సాకలేకపోతున్నానని బోరున విలపించింది. దీంతో చలించిన మంత్రి వెంకట్‌రెడ్డి ఆమెకు ధైర్యం చెప్పారు. సీఎంఆర్ఎఫ్ సంబంధించిన ఉన్నతాధికారి వేములు శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి మామిడి సత్యనారాయణ చికిత్సకు అయిన ఖర్చుకు సీఎంఆర్ఎఫ్ ఇవ్వాలని ఆదేశించారు. వెంటనే ఆమెకు రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. పిల్లలను తాను చదివిస్తానని భరోసా ఇచ్చారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

● కలెక్టర్ హనుమంతు కే. జెండగే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 4: రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ హనుమంతు కే. జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం డీఎంహెచ్‌వో పాపారావు అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. బస్టాండ్లలో తాగునీటి సౌకర్యం కల్పించే బాధ్యత ఆర్టీసీ అధికారులదే అన్నారు. ఉపాధి పథకం కింద పని చేసేవారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం 12గంటల వరకు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు మానుకోవాలన్నారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది వివిధ సమావేశాల్లో వడదెబ్బ కలిగే పరిణామాలపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేసి, వేసవి నుంచి గట్టెక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్ మాట్లాడుతూ అధిక సమయం ఎండలో ఉండకూడదని, ఉదయం 12గంటలలోపు వ్యవసాయ పనులు ముగించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు రుమాలు, తెల్లని దుస్తులు ధరించాలన్నారు. డీఎంహెచ్‌వో వై.పాపారావు మాట్లాడుతూ వడదెబ్బతో జ్వరం, తలనొప్పి, వికారం, వాంతులు అవుతాయన్నారు. శరీరానికి తగినంత నీరు లభించక గుండె, మూత్రపిండాలు తదితర అవయవాలు తమ పనులు నిర్వర్తించకపోవడం వల్ల వ్యక్తి మృతి చెందే ప్రమాదముందన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, గ్రామ పంచాయతీలు, రైల్వేస్టేషన్లు తదితర ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి పనుల ప్రదేశాలు, యాదగిరిగుట్ట ఆలయం, భువనగిరి రేణుకా ఎల్లమ్మ ఆలయం, వేములకొండ మత్స్యగిరి ఆలయం, భువనగిరి స్వర్ణగిరి ఆలయంతోపాటు ఇతర రద్దీ పుణ్యక్షేత్రాలు వద్ద చలువ పందిళ్లు, తాగునీరు, ఓఆర్ఎస్ మెడికల్ కిట్లు సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. సమీక్షలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎం.సుమన్‌కల్యాణ్, వంశీకృష్ణ, నోడల్ అధికారి అశ్వినికుమార్, అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్లు 4,61,806

తుదిజాబితా వెల్లడించిన అధికారులు

నల్లగొండ, ఏప్రిల్ 4: వరంగల్ - ఖమ్మం -నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను గురువారం అధికారులు ప్రకటించారు. మొత్తం 12 నియోజకవర్గాలకు కలిపి 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,87,007మంది పురుషులు, 1,74,794మంది మహిళలు, థర్డ్ జెండర్ ఓటర్లు ఐదుగురు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సిద్ధిపేట జిల్లాలో 4,671 మంది, జనగాంలో 23,320 మంది, హన్మకొండ జిల్లాలో 43,483 మంది ఓటర్లు ఉన్నారు. వరంగల్ జిల్లాలో 43,594 మంది, మహబూబాబాద్‌లో 34,759 మంది, ములుగులో 10,237మంది, భూపాలపల్లి జిల్లాలో 12,460మంది ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా భద్రాది జిల్లాలో 39,898మంది, ఖమ్మం జిల్లాలో 83,606మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 33,926 మంది ఓటర్లు ఉండగా, సూర్యాపేట జిల్లాలో 51,293మంది, నల్లగొండ జిల్లాలో 80,559 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 600పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నారు.

శాస్త్రోక్తంగా నిత్య తిరుకల్యాణోత్సవాలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 4: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య తిరు కల్యాణోత్సవపర్వాలు పాంచరాత్రాగమనరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమ పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా రూ. 15,93,918 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.


ప్రధానాలయంలో తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

'నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 4: నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి రూ.500కోట్లు కేటాయించాలని నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని పిలాయిపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీబ్రాహ్మణులు రాష్ట్రంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలని కోరారు. 50ఏళ్లు దాటిన వృత్తిదారులకు వృద్ధాప్య పింఛన్, అకస్మాతుగా మృతి చెందిన వారికి ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని కోరారు. భూదాన్‌పోచంపల్లిలో ధన్వంతరి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామశాఖ అధ్యక్షుడు కల్లేపల్లి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు చింతల వెంకటేష్, పెంబర్తి శ్రీనివాస్, కార్యదర్శి దుబాయ్ నర్సింగ్, నాయకులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో కలశాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మైహోంలో 108 కలశాభిషేకాలు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 4: మైహోం సిమెంట్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108కలశాభిషేకాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలోని మైహోం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవరోజు గురువారం అహోబిల రామానుంజస్వామివారి సమక్షంలో అష్టోత్తర శత కలశాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం ఇండస్ట్రీ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు దంపతులు, సంస్థ ప్రతినిధులు మునగాల రామ్మోహన్‌రావు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.


కలశాభిషేకంలో పాల్గొన్న మైహోం చైర్మన్ రామేశ్వరరావు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తిప్పర్తి, ఏప్రిల్ 4: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని జొన్నగడ్డల గూడెం గ్రామ శివారులో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నగడ్డలగూడెం గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జ్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గడ్డిలో గుర్తు తెలియని మృతదేహాన్ని ఆ గ్రామానికి చెందిన పశువుల కాపరులు గురువారం సాయంత్రం గుర్తించారు. అప్పటికే మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. అటుగా వచ్చిన పశువుల కాపర్లు గడ్డిలో నుంచి దుర్వాసన వస్తుండడంతో దగ్గరికి వెళ్లి పరిశీలించగా మృతదేహం కన్పించింది. వెంటనే తిప్పర్తి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించినట్లు సమాచారం. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్ర వాహనం చోరీ

మర్రిగూడ, ఏప్రిల్ 4: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామంలో ద్విచక్ర వాహనం గురువారం చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాడుగుల శ్రీనివాస్ తన వ్యవసాయ బావి వద్దకు పనుల నిమిత్తం తన సొంత ద్విచక్ర వాహనంపై వెళ్లి వ్యవసాయ భూమి పక్కనే ఉన్నచెట్టు వద్ద తన బైక్‌కు తాళం వేసి ఉంచాడు. వ్యవసాయపనుల్లో నిమగ్నమై ఉండగా చెట్టు వద్ద ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పనులు ముగిసిన అనంతరం మర్రిచెట్టు దగ్గరకు వెళ్లి అక్కడ చూడగా ద్విచక్ర వాహనం కన్పించలేదు. దీంతో మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


సరిత (ఫైల్)

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 4: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ ఎన్. అంతిరెడ్డి తెలిపారు. కట్టంగూర్ మండలం ఈదులూరు గ్రామానికి చెందిన ఉట్కూరి సరిత మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో నాలుగేళ్లగా నార్కట్‌పల్లిలోని తన తల్లిగారింట్లో ఉంటోంది. కాగా ఈ నెల 2వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లిన సరిత తిరిగి రాలేదు. బంధువులు, చుట్టు పక్కల ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. సరిత తల్లి బందెల మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూసీలో పడి పశువుల కాపరి మృతి


లింగయ్య మృతదేహం

పెన్‌పహాడ్, ఏప్రిల్ 4: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన గేదెల కాపరి మండల లింగయ్య(75) గురువారం మూసీ చెక్‌డ్యాం వద్ద నీటిలో పడి మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... లింగయ్య గ్రామస్తులు, రైతులకు చెందిన కొన్ని గేదెలతో పాటు, అతని గేదెలను కూడా కాస్తుంటాడు. ఈ నేపథ్యంలో రోజువారీగా నాగులపహాడ్ మూసీ వద్దకు గేదెలు తోలుకొని వెళ్లాడు. సాయంత్రం గేదెలు మాత్రమే ఇంటికి చేరుకున్నాయి. కానీ లింగయ్య ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెత్తుకుంటూ మూసీ వైపు వెళ్లారు. మూసీలోని కాల్వలో విగతజీవిగా పడి ఉన్నాడు. లింగయ్యకు భార్య భిక్షమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉన్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం సమచారం అందలేదని ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపారు.

చికిత్సపొందుతూ..

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 4: క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎనుగులదోరి గ్రామానికి చెందిన పన్నాల శంకర్‌రెడ్డి(78) కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శంకర్‌రెడ్డి ఈ నెల 2వ తేదీ రాత్రి ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 3వ తేదీ రాత్రి మృతిచెందాడు. శంకర్‌రెడ్డి కుమారుడు పాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

12 వరకు కంటి శస్త్రచికిత్స ఉచిత వైద్యశిబిరం

చిట్యాలరూరల్, ఏప్రిల్ 4: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉచిత మెగా కంటి శుక్ల శస్త్ర చికిత్స వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్, వైద్య శిబిరం నిర్వాహకుడు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏసిరెడ్డి శ్రీరాంరెడ్డి, ఏసీ కృపాకర్ జ్ఞాపకార్థం ఉచిత మెగా కంటి శుక్ల శస్త్రచికిత్స వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, అమెరికన్ తెలుగు అసోసియేషన్ సౌజన్యంతో గుండ్రాంపల్లిలోని రైతువేదికలో వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మొబైల్ సర్జికల్ బస్సులో నిష్ణాతులైన వైద్యులు కంటి శుక్లాల శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చేవారు వైద్యపరీక్షల రిపోర్టులు, ఆధార్ కార్డు జిరాక్స్‌ను కూడా తీసుకురావాలని సూచించారు. వివరాలకు సెల్: 8008106566, 7989131262, 8897384164 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

జాతీయ స్థాయిలో ఒలంపియాడ్‌లో ప్రతిభ



నకిరేకల్, ఏప్రిల్ 4: ఒలంపియాడ్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా మ్యాథ్స్ అండ్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో నల్లగొండ జిల్లా నకిరేకల్ సెయింట్ ఆన్స్ స్కూల్‌కు చెందిన ముప్పం కృతిక జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిందని పాఠశాల మెస్సెస్ సిస్టర్ లీనా ఆంటోని తెలిపారు. పాఠశాలకు చెందిన 10మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన కృతికను పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

'ఉపాధి' పనులు త్వరగా ముగించుకోవాలి


ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న పీడీ నాగిరెడ్డి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 4: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 7 గంటలకల్లా పనిప్రదేశానికి చేరుకుని కొలతల ప్రకారం పనులు చేసుకుని త్వరగా ఇంటికి చేరుకోవాలని నల్లగొండ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి ఉపాధి కూలీలకు సూచించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పెద్దచెరువులో ఉపాధి హామీ కూలీలతో చేయిస్తున్న పూడికతీత పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడుతూ రోజుకు ఒక్కో కూలీకి రూ.300ల గిట్టుబాటు కూలీ రావాలంటే ఎంత పనిచేయాలో తెలుసా అని ప్రశ్నించారు. ఎంత పనిచేయాలో వారికి అవగాహన కల్పించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమేశ్‌చారి, ఏపీవో యాదయ్య, ఈసీ రాంబాబు, సీహెచ్‌వో బడుగు శ్రీరాములు తదితరులు ఉన్నారు.

కూతురు వివాహానికి వెలుతుండగా..

కొణిజర్ల, ఏప్రిల్ 4: తమ కూతురు వివాహానికి బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొని భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం ఉదయం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలో జరిగింది. కొణిజర్ల ఎస్ఐ శంకర్‌రావు, స్థానికుల కథనం ప్రకారం సూర్యపేట జిల్లా, కోదాడ మండలం, నల్లబండగూడెం గ్రామానికి చెందిన ఏదులపురం సైదులు, మంగ దంపతుల ఏకైక కుమార్తె రమ్య వివాహం ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి ఉపేందర్, నాగమణిల పెద్దకుమారుడు నరేందర్‌తో కుదుర్చుకున్నారు. గురువారం ఉదయం 9.10నిమిషాలకు వివాహ ముహూర్తం ఉండటంతో సైదులు, మంగ దంపతులు తమ కూతుర్నెను ముందుగానే కల్యాణ వేదికవద్దకు పంపించి వారు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో తనికెళ్ల సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. ప్రమాదంలో భార్యాభర్తలకు తల భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని 108లో ముందుగా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులకు ప్రమాదం జరిగినా వివాహ ముహూర్తం తప్పకూడదనే ఉద్దేశంతో బంధవులు వారి కుమార్తె వివాహం జరిపించారు.

ఇద్దరి నిర్లక్ష్యానికి.. ముగ్గురి బలి

● జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం ● ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో ● సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘటన


ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకట్‌రావు


మృతిచెందిన లునావత్ రుక్కమ్మ, గొలుసుల వేదాశ్విని, చింతరెడ్డి సరితారెడ్డి

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 4: వాహనం నడపడంలో నిర్లక్ష్యం ముగ్గురి ప్రాణాలు బలితీసుకుంది. 16మంది ప్రయాణిస్తున్న ఆటోను కారు బలంగా ఢీకొనటంతో ముందు నిలిపి ఉంచిన లారీ వద్దకు దూసుకెళ్లి ముగ్గురు మృతిచెందగా, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గురువారం సాయంత్రం సూర్యాపేట జిల్లాకేంద్రం సమీపంలోని మాననగర్ సమీపంలో 65వ జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై విజయవాడ వైపునకు వెళ్తున్న లారీ రోడ్డుపై నిలిపాడు. అదే సమయంలో అర్వపల్లి నుంచి సూర్యాపేట పట్టణానికి 16మంది ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని వస్తున్న డ్రైవర్ ఆగి ఉన్న లారీని తప్పించబోయే క్రమంలో వెనుక నుంచి అతివేగంతో వస్తున్న కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అర్వపల్లి నుంచి సూర్యాపేటకు ఆటోను వస్తున్న ప్రయాణికులైన సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చింతరెడ్డి సరితారెడ్డి, సూర్యాపేట మండలం లక్ష్మీతండాకు చెందిన లునావత్ రుక్కమ్మ, అర్వపల్లి మండలం కసర్లపహాడ్ గ్రామానిక చెందిన కంపాసాటి మహేష్, పిల్లల మర్రి గ్రామానికి చెందిన చెర్కుపల్లి సైదమ్మ, చెర్కుపల్లి శైలజ, విజేందర్, వల్లభాపురం గ్రామానికి చెందిన జీడిమెట్ల సైదులు, తుంగతుర్తి మండలం పసునూరుకు చెందిన గొలుసుల సంధ్య, కొమ్ము సువర్ణ, వేదాశ్విని, మోక్షిత్, గుంపుల గ్రామానికి చెందిన హైమావతి, రమణ, అడివెంలకు చెందిన సాయిరెడ్డి, ఏనుబాములకు చెందిన లావణ్య, పావని గాయపడ్డారు.

మృతులు వీరే..

సూర్యాపేట పట్టణానికి చెందిన చింతరెడ్డి సరితారెడ్డి(49) జాజిరెడ్డి గూడెం సోషల్ వెల్ఫేర్ పాఠశాలలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. ఆమెకు కుమారుడు ఉన్నాడు. సూర్యాపేట మండలం లక్ష్మీతండాకు చెందిన లునావత్ రుక్కమ్మ(55)ది వ్యవసాయ కుటుంబం. ఈమె లక్ష్మీతండా సర్పంచ్ సూర్యనాయక్ సతీమణి. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పసునురుకు చెందిన చిన్నారి వేదాశ్విని(17 నెలలు) మృతిచెందగా, గొలుసు మోక్షిత్(7) పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. మిగిలిన వారిలో కొందరు తీవ్రంగా మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సూర్యాపేట రూరల్ పోలీసులు వాహనాల్లో సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంకట్రావ్ హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జరిగిన విషయం తెలుసుకుని జనరల్ ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

తల్లివెంట వెళ్లి..

పుట్టినింటికి వచ్చిన గొలుసుల సంధ్య ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడానికి కుమారుడు మోక్షిత్(7), కుమార్తె వేదాశ్వినితో ఆటోలో సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బలమైన గాయాలైన వేదాశ్విని అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన మోక్షిత్‌ను హైదరాబాద్ తరలించారు. అప్పటివరకు కళ్లెదుట సంతోషంగా కదలాడిన ఇద్దరు పిల్లల్లో ఒకరు మృత్యువాత పడటం, మరొకరు మృత్యువుతో పోరాడుతుండటంతో ఆమె రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

ఐదు నిమిషాల్లో చేరుకునే లోపే..

అర్వపల్లి నుంచి సూర్యాపేటకు 25కిలోమీటర్లు దూరం ప్రయాణికులు మరికొద్ది సేపట్లో గమ్యానికి చేరుకుంటామనుకునే లోపు ఆగి ఉన్న లారీ రూపంలో మృత్యువు కబలించింది. మాననగర్ నుంచి సూర్యాపేట కొత్త బస్టాండ్‌కు ఐదు నిమిషాల్లో చేరుకునేలోపే అంతలోనే ఆగి ఉన్న లారీ, వెనుక నుంచి వచ్చిన కారు వీరిని బలిగొన్నాయి.

ప్రమాదానికి ఇదే కారణమా?

డ్రైవర్ అజాగ్రత్త.. ఫోన్‌లో మాట్లాడడం.. ఆటోలో సౌండ్ సిస్టమ్ ఈ ప్రమాదానికి కారణమని క్షతగాత్రులు బోరున విలపించారు. ఆటో ఎక్కిన దగ్గర నుంచి సూర్యాపేటకు వచ్చే వరకు డ్రైవర్‌కు ఫోన్లు వస్తున్నాయని, ఆటోలో భారీ శబ్దంతో సౌండ్ సిస్టమ్ ఉందని దాని వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీ డ్రైవర్ నిలపరాని చోట జాతీయ రహదారిపై నిలపడం ప్రమాదానికి మరో కారణం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి


ప్రమాదానికి కారణమైన ఆటో ట్రాలీ

కేతేపల్లి, ఏప్రిల్ 4: నల్లగొండ జిల్లా నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ఆటో బోల్తా పడి మహిళ మృతిచెందింది. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళ్ళపురం గ్రామానికి చెందిన ఆమనగంటి అశోక్ తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. జీవనోపాధి కోసం అశోక్ తన ట్రాలీ ఆటోను జీహెచ్ఎంసీలో చెత్త తరలించేందుకు పెట్టాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం స్వగ్రామం ఇస్తాళ్ళపురంలో నిర్వహించే పండుగకు కుటుంబంతో కలిసి ట్రాలీ ఆటోలో వెళ్లాడు. కార్యక్రమం పూర్తికావడంతో బుధవారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి అదే ఆటోలో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో ఇనుపాముల బస్‌స్టేజీ సమీపంలో ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న ఆమనగంటి మల్లయ్య, అశోక్ తల్లి ఎల్లమ్మ, నాయిని అనంతమ్మ, నాయిని భారతమ్మ, నాయిని ఎల్లయ్య, ఆమనగంటి పూలమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆమనగంటి ఎల్లమ్మ(44) మృతిచెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పి లారీని ఢీకొని..



నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండకు చెందిన తండు మహేశ్(35) బైక్‌పై రామన్నపేటకు వెళ్తున్నాడు. నార్కట్‌పల్లిలోని నల్లగొండ ఫ్లైఓవర్‌పై ముందు వెళ్తున్న లారీ సిగ్నల్స్ ఇవ్వకుండా అకస్మాత్తుగా ఆపడంతో వెనుక నుంచి బైక్‌పై వస్తున్న మహేశ్ అదుపుతప్పి లారీని ఢీ కొట్టాడు. దీంతో మహేశ్ తలకు బలమైన గాయాలు కాగా 108అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. మహేష్ బంధువు చింతల నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

హుజూర్‌నగర్ రూరల్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని అమర్‌నగర్, అమరవరం గ్రామాల మధ్య బుధవారం రాత్రి హనుమంతులగూడెం గ్రామానికి చెందిన తుపాకుల లక్ష్మీనారాయణ(30) బైక్ వస్తుండగా అదుపుతప్పి పడి పోయాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

చౌటుప్పల్ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారం జాతీయరహదారిపై గురువారం బైక్ ఆదుపు తప్పి పడిపోవడంతో వృద్ధుడు మృతిచెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన కందాటి మోహన్‌రెడ్డి(71) బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మోహన్‌రెడ్డిని హైదరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

చౌటుప్పల్ రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా బలవరపు మండలం కోమినేనివారి పాలెం గ్రామానికి చెందిన బోజ సామ్రాజ్యం(60) కారులో తన అల్లుడు సురేష్‌తో కలిసి హైదరాబాద్‌కు వస్తుండగా ముందుగా వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో సామ్రాజ్యం అక్కడికక్కడే మృతిచెందింది. సురేష్‌కు గాయాలయ్యాయి. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని

నేరేడుచర్ల: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని సోమవారం గ్రామ శివారులో గురువారం ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ ధాన్యం లోడుతో నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు వెళ్తుండగా అదే సమయంలో గరిడేపల్లి మండలం ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన మిగిడి జానయ్య(48) సోమవారం గ్రామం నుంచి కల్లూరు వైపు వెళ్తుండగా ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. జానయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో మిర్యాలగూడలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

ప్రపంచ పటంలో ఫణిగిరి బౌద్ధశిల్పాలు

● పర్యాటక సాంస్కృతిక, క్రీడలు, పురావస్తు శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్


ఫణిగిరిలో పురాతన నాణేలు పరిశీలిస్తున్న శైలజరామయ్యర్,

నాగారం, ఏప్రిల్ 4: చారిత్రక బౌద్ధ శిల్పాలు, నాణేలు, స్థూపాలు, కళాఖండాలతో మారుమూలనున్న ఫణిగిరి గ్రామం ప్రపంచ పటంలో నిలిచిందని పర్యాటక సాంస్కృతిక, క్రీడలు, పురావస్తు శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్ అన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద ఫణిగిరి కొండపై ఇటీవల తవ్వకాల్లో బయటపడిన ఇక్ష్వాకుల కాలం నాటి సీసపు నాణేలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫణిగిరిలోని తవ్వకాల్లో లభించిన సీసపు నాణేలతో ఫణిగిరి బౌద్ధక్షేత్రం ఒక మైలురాయి దాటిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతి, నాగార్జున కొండల్లో లభించిన బౌద్ధ చారిత్రక ఆనవాళ్లను మించి ఫణిగిరిలో లభ్యమవుతున్నాయన్నారు. మార్చి 29వ తేదీన ఫణిగిరి గుట్టపై నిర్వహించిన తవ్వకాల్లో 3,730 నాణేలు లభించడం చరిత్రలో అరుదైన రోజుగా భావిస్తున్నామన్నారు. ఇప్పటివరకు క్రీస్తుశకం 2వ శతాబ్దం నుంచి క్రీస్తుశకం 4వ శతాబ్దం వరకు ఇంత పెద్ద మొత్తంలో నాణేలు, స్థూపాలు, చైత్యాలు లభించాయని, ఈ నాణేలపై ఒకవైపు ఏనుగు మరో వైపు ఉజ్జయిని గుర్తు కలిగి ఉన్నాయని తెలిపారు. ఇక్ష్వాకుల కాలం నాటి నాణేలుగా నిర్ధారించినట్లు ఆమె తెలిపారు. ఫణిగిరిలో మ్యూజియం ఏర్పాటుకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ పూర్తి సహకారం అందజేయడంతో ఇక్కడ తవ్వకాల్లో లభించిన బౌద్ధ ఆధారాలను సందర్శకులు తిలకించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ లభించిన బౌద్ధ మహా స్థూపం, ఉద్దేశిక స్థూపాలు, శిలా శాసనాలు, నాణేలు వీటన్నింటికీ ఫణిగిరి గ్రామస్థులే వారసులని హెరిటేజ్ డైరెక్టర్, ఐఏఎస్ భారతి హోళికేరి అన్నారు. ఇప్పటివరకు ఫణిగిరిలో ఏడుసార్లు తవ్వకాలు చేయగా, ప్రతిసారి అద్భుతమైన బౌద్ధ ఆధారాలు లభిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, ఉప సంచాలకులు నారాయణ, మల్లునాయక్, తహసీల్దార్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వే బ్రిడ్జి తూకంలో మోసం

● ధాన్యం తూకంలో 200 కిలోల తేడా ● అనుమానంతో మళ్లీ తూకం వేయించిన రైతులు


అమ్మనబోలులో రాస్తారోకో చేస్తున్న రైతులు



చెన్నకేశవ వేబ్రిడ్జిలో 8,030 కిలోలు చూపిస్తున్న కాంటా

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 4: రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని తూకం వేయడంలో వే బ్రిడ్జి నిర్వాహకుడి మోసం బయట పడింది. ధాన్యం తూకంలో 200 కిలోల తేడా ఉండడంతో అనుమానం వచ్చిన రైతు మళ్లీ తూకం వేయించడంతో గుట్టు రట్టయింది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలులో బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. జంగిలి నర్సింహ అనే వ్యాపారి అమ్మనబోలులో ధాన్యం కొనుగోలు చేస్తూనే మరోపక్క అరుణ వే బ్రిడ్జి కూడా నిర్వహిస్తున్నాడు. రైతులు విక్రయించేందుకు తెచ్చిన ధాన్యాన్ని తన వే బ్రిడ్జి వద్దే తూకం వేసి కొనుగోలు చేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన మల్లయ్య అనే రైతు తన పొలంలో పండిన ధాన్యాన్ని బుధవారం నర్సింహ దగ్గరకు తీసుకువచ్చి కాంటా వేయించగా 7,830కిలోలు చూపించింది. తాను అంచనా వేసిన దానికంటే తక్కువ తూకం రావడంతో రైతుకు అనుమానం వచ్చింది. వెంటనే అదే ధాన్యం లోడును అక్కెనపల్లిలో ఉన్న చెన్నకేశవ వే బ్రిడ్జి వద్ద మరోసారి కాంటా వేయించగా 8,030 కిలోలుగా చూపించింది. దీంతో 200కిలోలు (రెండు క్వింటాళ్లు) ధాన్యం తక్కువ తూకంతో నష్టపోతున్నట్లు గుర్తించి ఇదే విషయాన్ని తోటి రైతులకు చెప్పాడు. అందరూ కలిసి అరుణ వే బ్రిడ్జి వద్దకు వెళ్లి తక్కువ తూకంపై నిలదీయగా నిర్వాహకుడు పొంతన లేని సమాధానం ఇచ్చాడు. దీంతో రైతులు ఇంద్రారెడ్డి, మల్లయ్యలతో మరికొంతమంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వే బిడ్జిపై చర్యలు తీసుకోవాలని రైతుల ధర్నా

తక్కువ తూకంతో రైతులను మోసం చేస్తున్న వే బ్రిడ్జి నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు అమ్మనబోలులో గురువారం కొద్దిసేపు రాస్తారోకో చేశారు. చాలా కాలం నుంచి రైతులను మోసం చేస్తున్నాడని, తాము గ్రహించలేదని ఆవేదన చెందారు. అసలే ధాన్యం దొంగతనాలతో తాము బెంబేలెత్తుతుంటే ఈ రకమైన దోపిడీ చేస్తున్నారని, తాము ఏం చేయాలని ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించాలని డిమాండ్ చేశారు. స్పందించిన జిల్లా లీగల్ మెట్రాలజీ(తూనికలు కొలతల శాఖ) అధికారి రామకృష్ణతో పాటు నార్కట్‌పల్లి తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి అమ్మనబోలుకు వెళ్లారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అరుణ వే బ్రిడ్జిని తనిఖీ చేశారు. క్వింటాల్ పరిమాణానికి సుమారు ఐదు కిలోల మేర తక్కువ తూకం వస్తున్నట్లు నిర్ధారించారు. లీగల్ మెట్రాలజీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

వే బిడ్రి నిర్వాహకులపై కేసు నమోదు

అమ్మనబోలులో రైతు ధాన్యం తూకంలో మోసానికి పాల్పడిన నిర్వాహకులపై కేసు నమోదైంది. రైతు ఫిర్యాదు మేరకు వేబ్రిడ్జి నిర్వాహకులు నర్సింహ, కార్తీక్, శ్రీహరిపై కేసు నమోదు చేసినట్లు తూనికలు, కొలతల శాఖ అధికారి రామకృష్ణ తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

● మాజీమంత్రి కుందూరు జానారెడ్డి


డిండిలో మాట్లాడుతున్న మాజీమంత్రి కుందూరు జానారెడ్డి

చందంపేట, దేవరకొండ, ఏప్రిల్ 4: చందంపేట మండలంలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మాజీమంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఎస్ఎల్‌బీసీ నక్కలగండి సొరంగమార్గాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఎన్నికలు పూర్తికాగానే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రాజెక్టును పూర్తిచేసి చందంపేట మండలాన్ని సశ్యశామలం చేస్తామన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ అంబ భవాని లిఫ్టు ఇరిగేషన్, కంభాలపల్లి ప్రాజెక్టు, పొగిళ్ల తదితర ప్రాజెక్టులను పూర్తిచేసి చందంపేట మండలాన్ని సశ్యశామలం చేస్తామన్నారు. సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సాధిక్, వెంకన్నగౌడ్, వెంకులు, నక్క నర్సింహ పాల్గొన్నారు. దేవరకొండ పట్టణంలోని మక్కా మజీద్‌లో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీమంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వేణుధర్‌రెడ్డి, నెమికంటి గౌరిశంకర్, ఎం.ఎ. సిరాజ్‌ఖాన్, అబిద్ అలీ, నజీర్ అహ్మద్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాకు ఎంతో సేవచేశా : జానా

డిండి: మంత్రిగా నల్లగొండ జిల్లాకు ఎంతో సేవచేశానని మాజీమంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. డిండి మండలకేంద్రంలో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు రిజర్వేషన్లు, ఆహార భద్రతచట్టం, ఉపాధిహామీ, అటవి హక్కుల చట్టం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పేదలకు 4లక్షల ఇళ్లతో పాటు రెండున్నర లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే రావి నారాయణరెడ్డికి మెజార్టీకంటే నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీరారెడ్డికి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి లక్ష మెజారిటీ ఇవ్వాలని కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్ జెండా కింద పనిచేసే వారిని స్వాగతిస్తున్నామని, గ్రూపు రాజకీయాలను చేసేవారు తన వద్దకు రానివ్వబోనియమని స్పష్టం చేశారు. అనంతరం మాజీమంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో బీఆర్ఎస్ జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగార్జునరెడ్డి, గుర్రం రాములు, వైస్‌ఎంపీపీ పూలమ్మ, ఎంపీటీసీలు వెంకటయ్య, తిరుపతి, దేవరకొండ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జంగారెడ్డి, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు లింగారెడ్డి, సిరాజ్‌ఖాన్, వెంకటేశ్వరరావు, రాజేష్, నాగార్జునరెడ్డి, రాంకిరణ్, జంగారెడ్డి, శ్రీనివాసగౌడ్, పోలం లక్ష్మణ్, మేకల సాయమ్మ కాశయ్య, గుర్రం రాములు, లక్‌పతినాయక్, వెంకటయ్య, మేకల సాయమ్మ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై అజమాయిషీ ఏదీ?

- ప్రభుత్వ..గోల్డెన్ ఫారెస్టు భూముల్లో మట్టి తవ్వకాలు
- సుప్రీం కోర్టు ఆధీనంలోని భూములపై కొరవడిన పర్యవేక్షణ
- ఫిర్యాదులు అందినా పట్టింపేదీ?

బీబీనగర్, ఏప్రిల్ 4: బీబీనగర్ మండలంలో మట్టిమాఫియా చెలరేగిపోతోంది. ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. సుప్రీం కోర్టు పరిధిలో ఉన్న వందల కోట్ల విలువ చేసే భూములపై మట్టి మాఫియా కన్ను పడింది. బీబీనగర్ - భూదాన్‌పోచంపల్లి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా విస్తరించి ఉన్న గోల్డెన్ ఫారెస్టు భూముల్లోకి చొరబడి మట్టిని తవ్వేస్తూ లూటీ చేస్తున్నారు. సుమారు రెండు నెలలకు పైగా ఇక్కడి భూముల్లోకి చొరబడి భారీ యంత్ర సామగ్రితో ఇష్టానుసారంగా తవ్వేస్తూ వందలాది టిప్పర్ల మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలపై సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రాఘవాపురంలో పరిధిలో గోల్డెన్‌ఫారెస్ట్ భూముల్లో మట్టిని తవ్వుతున్న యంత్రాలు

గోల్డెన్ ఫారెస్టు భూముల్లో..

బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి ప్రధాన రహదారి మార్గంలో వందల కోట్లు విలువ చేసే గోల్డెన్ ఫారెస్టు భూములపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇదే అదునుగా మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పెట్టిన పెట్టుబడికి మూడేళ్లలో రెట్టింపు చెల్లిస్తామని ప్రజలను నమ్మబలికి గోల్డెన్ సంస్థ వేలాది మంది సంస్థల్లో డిపాజిట్ చేసిన పెట్టుబడి డబ్బులతో గోల్డెన్ ఫారెస్టు ఇండియా ప్రైవేటు లిమిటెడ్ , గోల్డెన్ టూరిస్టు రిసార్ట్ డెవలపర్స్ లిమిటెడ్ పేర్లతో రాఘవాపురం రెవెన్యూ పరిధిలో 300 ఎకరాలకు పైగా భూములను ఈ సంస్థ రెండు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసింది. ప్రజలకు నమ్మకం కలిగించేందుకు ఇక్కడి భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. కాగా ఈ సంస్థ యజమానిపై అవినీతి ఆరోపణలు రావడంతో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. దీని కారణంగా ఇక్కడి భూముల అంశం వివాదంగా మారింది. చివరకు సుప్రీం కోర్టు ఆధీనంలోకి వెళ్లింది. అప్పటి నుంచి ఈ భూములపై పర్యవేక్షణ కొరవడింది. ఇదే అదునుగా భావించి అప్పటికే సంస్థకు భూములను విక్రయించిన స్థానిక రైతులు తిరిగి ఆ భూములను స్వాధీనం చేసుకుని పంటలు సాగు చేస్తుండగా మిగతా వారు మట్టి మాఫియాతో కుమ్మక్కై మట్టిని తవ్వేస్తున్నారు. బీబీనగర్, రాఘవాపురంతో పాటు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, ఘట్కేసర్ మండలం అవుషాపురం గ్రామానికి చెందిన కొందరు ముఠాగా ఏర్పడి గుట్టు చప్పుడు కాకుండా మట్టి వ్యాపారానికి తెరలేపారు.



తవ్వకాల కారణంగా గోతులుగా మారిన గోల్డెన్ ఫారెస్ట్ భూమి

తరలుతున్న సారవంతమైన మట్టి

వందల కోట్లు విలువ అయిన గోల్డెన్ ఫారెస్టు భూములలో కొన్ని నెలలుగా మట్టి తవ్వకాలు జరపడం వల్ల సారవంతమైన భూములు పెద్ద పెద్ద గోతులుగా తయారయ్యాయి. ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి, మట్టిని తవ్వి వందలాది టిప్పర్ల మట్టిని ఇతర ప్రాంతాలలోని వెంచర్లకు, ఇతర అవసరాలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగటిపూట విరామం ఇచ్చి రాత్రి పూట మట్టిని తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో సారవంతమైన భూములు గోతులతో నిండిపోతున్నాయని పేర్కొంటున్నారు. గోల్డెన్ ఫారెస్టు భూములలో జరుగుతున్న మట్టి తవ్వకాలపై ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. సుప్రీం కోర్టు ఆధీనంలో ఉన్న కోట్ల విలువ చేసే భూముల్లో తవ్వకాలు జరుపుతున్న మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వకాలు చేసేవారిపై చర్యలు తీసుకుంటాం



గోల్డెన్ ఫారెస్టు ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని నా దృష్టికి వచ్చింది. ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో ఎవ్వరు తవ్వకాలు జరిపినా యంత్రాలు, వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. పోలీస్ శాఖతో కలిసి మట్టి రవాణా మార్గాల్లో చెక్ పోస్టు పెట్టి పూర్తిగా నియంత్రిస్తాం.

-శ్రీధర్, తహసీల్దార్, బీబీనగర్

పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



పోలీస్ అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న స్థానిక పోలీసులు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 4: పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎస్ఐ డి.నాగరాజు అన్నారు. మోత్కూరు మండలం జానకీపురం వద్ద 2015 ఏప్రిల్ 4న సిమి ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన అప్పటి ఆత్మకూరు(ఎం) ఎస్ఐ డి.సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజుల చిత్రపటాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జానకీపురం గ్రామ శివారులో ఉగ్రవాదులతో జరిగిన దాడిలో కానిస్టేబుల్ నాగరాజు అక్కడే మృతిచెందగా, ఎస్ఐ సిద్దయ్యకు తలలో తూటాలు దిగి పడిపోయాడని, చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం మృతిచెందాడని తెలిపారు. ఈ ఘాతుకానికి పాల్పడిన సిమీ ఉగ్రవాదులను పోలీసులు అక్కడిక్కడే మట్టుపెట్టారని తెలిపారు. సిద్దయ్య, నాగరాజుల మరణం అజరామరమని అన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ యాకూబ్‌ఖాన్, సిబ్బంది అంజనేయులు, శంకర్ పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో విశ్రాంత సైనికులకు వైద్య సేవలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 4: బీబీనగర్ ఎయిమ్స్‌లో విశ్రాంత సైనికులకు ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్టు విశ్రాంత సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు దామోధర్‌రెడ్డి తెలిపారు. గురువారం భువనగిరిలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత సైనికుల అసోసియేషన్ జాతీయ చైర్మన్ ఎల్.జగన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, అధ్యక్షుడు నంది పాపిరెడ్డి చేసిన కృషితో ఎయిమ్స్‌లో విశ్రాంత సైనికులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్టు తెలిపారు. ఈ మేరకు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో దొంతర బోయిన దైవ దినం, శంకరరెడ్డి, బాలేశ్వర్ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను ఆదరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి వెంకటనర్సు

మోత్కూరు, ఏప్రిల్ 4: స్వార్థ, అవకాశవాద రాజకీయ నాయకులకు అవకాశం ఇవ్వకుండా ప్రశ్నించే సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను ఆదరించి, పార్లమెంటుకు పంపాలని పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. గురువారం మండలంలోని పాలడుగు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంత కాలం బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పార్లమెంటుకు పంపితే ప్రజలకు ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. నిత్యం ప్రజల కోసం పని చేస్తూ, ఉద్యమాల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. కొంపెల్లి గంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కమిటీ సభ్యులు దడిపెల్లి ప్రభాకర్, కొంపెల్లి ముత్తమ్మ, చంద్రయ్య, సోమరాజు, లక్ష్మణ్, సైదులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం




వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రామాంజుల్‌రెడ్డి, రెడ్ క్రాస్ ప్రతినిధులు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 4: రెడ్ క్రాస్ సంస్థ స్వచ్ఛంద సేవలు అభినందనీయమని మునిసిపల్ కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డి అన్నారు. గురువారం భువనగిరిలో మునిసిపల్ పారిశుధ్య కార్మికుల కోసం రెడ్ క్రాస్ సంస్థ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలను అంటు రోగాల నుంచి కాపాడుతున్న పారిశుధ్య కార్మికులను గౌరవించడం అందరి బాధ్యత అని అన్నారు. వ్యక్తిగత ఆరోగ్యానికి అందరూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా వైస్‌చైర్మన్ దిడ్డి బాలాజీ, డైరెక్టర్లు షేక్ హమీద్ పాష, బొక్క రాంబాయి, ఉపేందర్‌రావు, స్పందన, లావణ్య, భాగ్య, సుమిత్ర పాల్గొన్నారు.

మోత్కూరులో ఉగాది పురస్కారాల ప్రదానం రేపు

మోత్కూరు, ఏప్రిల్ 4: క్రోధినామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 6న మోత్కూరులో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 18 మందికి మోత్కూరి విజయలక్ష్మీ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉగాది పురస్కారాలు అందించనున్నట్టు ఆ ట్రస్ట్ చైర్మన్ మోత్కూరి బ్రహ్మచారి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉగాది నుంచి ప్రతి యేటా విజయలక్ష్మీ జ్ఞాపకార్థం ఉగాది పురస్కారాలు అందిస్తానన్నారు. సూరోజు భాస్కరాచారి, మొగుళ్లపల్లి సోమయ్య, పోచం నారాయణ, కోక బిక్షం, అండెం దయాకర్‌రెడ్డి, మన్నె రాములు, బిల్లకంటి గోవర్ధన్‌రెడ్డి, అన్నెపు నర్సింహ, అన్నెపు వెంకట్, గుమిడెల్లి వెంకన్న, జె.సుబ్రమణ్య శర్మ, సిరసు సురేష్, కాంబోజు మహేందర్, గుండగోని రామచంద్రు, కూర్లెల అలివేలు మంగమ్మ, జిట్ట సైదమ్మ, నల్ల స్వప్నలకు ఈ నెల 6 ఉదయం పది గంటలకు విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో పురస్కారాలను అందజేస్తామన్నారు.

వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటం, శంఖుచక్రాల అందజేత



వెండి కిరీటం అందిస్తున్న కృష్ణారెడ్డి దంపతులు

మోత్కూరు, ఏప్రిల్ 4: మోత్కూరు మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని స్వామి వారికి గురువారం గుజ్జల కృష్ణారెడ్డి-జ్యోతి దంపతులు రూ.2.61లక్షల విలువైన వెండి కిరీటం, శంఖుచక్రాలు బహూకరించారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముప్ప వెంకట్‌రెడ్డి, తడిసిన సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ దాత ఎగుమాటి రాంరెడ్డి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సోలిపురం చంద్రారెడ్డి, అధ్యక్షుడిగా ముప్ప వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సోమ వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఆమనగంటి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కొప్పుల కరుణాకర్‌రెడ్డి, గుండా మల్లేశం, సహాయ కార్యదర్శిగా మెట్టు మంగేష్, కార్యవర్గ సభ్యులుగా మొగుళ్లపల్లి సోమయ్య, సోలిపురం శైలజ, మర్రి జయశ్రీ, ముప్ప తిరుమల్‌రెడ్డి, గుండా బాలాజీ, బుడ్డి వెంకటేశ్వర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.

పథకాలను ఓర్వలేకపోతున్న బీజేపీ, బీఆర్ఎస్

- ప్రభుత్వ విప్ అయిలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. యాదగిరిగుట్టలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డిపై అక్కసు వెళ్లగక్కుగున్నారని విమర్శించారు. ఈ నెల ఆరో తేదీన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే జనగర్జన మహాసభలో ఐదు న్యాయాలు, 25 గ్యారంటీలను ప్రకటిస్తామని తెలిపారు. దేశంలో యువ, కిసాన్, నారీ, శ్రామిక్ న్యాయ్, ఎస్సీదారీ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లనున్నట్లు తెలిపారు. పథకాలను తుక్కుగూడ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ ప్రవేశపెడతారని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకుడు జనగాం ఉపేందర్ రెడ్డి, ఆలేరు, గుట్ట ఎంపీపీలు అశోక్, చీర శ్రీశైలం పార్టీ మండల అధ్యక్షుడు కానుగ బాలరాజ్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశం, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, నాయకులు ఎరుకల హేమేందర్ గౌడ్, భిక్షపతిగౌడ్, గుడ్ల వరలక్ష్మి, గుండు జ్యోతి, శ్రీవల్లి పాల్గొన్నారు.

గుట్టలో యోగా యూనివర్సిటీ ఏర్పాటుకు కషి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 4: యాదగిరిగుట్ట పట్టణంలో యోగా యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానని భువనగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. గురువారం పట్టణంలో మార్నింగ్‌వాక్‌లో భాగంగా వాకర్‌తో మాట్లాడి, యాదగిరిపల్లి, ఎస్సీ కాలనీ, పాత, కొత్త గుండ్లపల్లి, మండలంలోని మాసాయిపేట, యాసోజీగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే యాదగిరిగుట్ట పట్టణాన్ని మెడికల్ హబ్‌గా ఏర్పాటు చేస్తానని, గుట్ట ఆలయానికి ఎంఎంటీఎస్‌తో పాటు మెట్రోను తీసుకురావడానికి కృషిచేస్తానని అన్నారు. యాదగిరిగుట్ట, భువనగిరి పట్టణాలను క్వీన్ సిటీలుగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. అయోధ్యలో శ్రీరాముని ఆలయం 22 ఎకరాలలో నిర్మాణం చేయడానికి రూ. 1600 కోట్లు ఖర్చు అయితే, యాదగిరిగుట్ట ఆలయం కేవలం 2.50 ఎకరాల్లో నిర్మాణం చేయడానికి రూ.1400కోట్లు ఖర్చు ఎలా చేశారని ప్రశ్నించారు. దేవుడి సొమ్ము అంతా గత పాలకులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికే గ్రామాల్లో అన్ని పార్టీల నాయకులు తనను బలపర్చుతున్నారని, తప్పకుండా ప్రజలు తనను గెలిపిస్తారని చెప్పారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, గుంటిపల్లి సత్యం, రచ్చ శ్రీనివాస్, చిరిగే శ్రీను, ఊట్కూరి అశోక్, బందారపు మల్లేశం, ఆకుల చంద్రమౌళి, భువనగిరి శ్యామ్, మధు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భువనగిరి రూరల్ : మండలంలోని నందనం గ్రామ మాజీ సర్పంచ్ కడమంచి ప్రభాకర్‌ను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం పరామర్శించారు. ప్రభాకర్ మాతృమూర్తి జాలమ్మ ఇటీవలే మృతి చెందారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీటీసి సుబ్బూరు బీరుమల్లయ్య, ఉన్నారు.

గుండాల: మండలంలోని పాచిల్ల గ్రామంలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎలగందుల సైదులుకు న్యాయం చేయాలని అతని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు జోక్యం చేసుకుని రాస్తారోకో చేస్తున్న వారిని సముదాయించి లారీ యజమానితో మాట్లాడి న్యాయం చేస్తానని చెప్పి రాస్తారోకోను విరమింప చేశారు.

భువనగిరి టౌన్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో రంజాన్ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రఘుఅఖిల రంజాన్ మాస ఉపవాసాలు, పండుగ విశిష్టతను వివరించారు. పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

గుండాల: మండల కేంద్రంలో గురువారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల శిక్షణ పరిశీలకుడు పెసరు లింగారెడ్డి, తహసీల్దార్ జలకుమారి, మాస్టర్ ట్రైనర్స్ సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, నరేశ్ ఉన్నారు.

భువనగిరి రూరల్: మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని వీరవెళ్లి గ్రామంలో పర్యటించి ఒహెచ్ఆర్ వాటర్ ట్యాంక్‌లు, మంచినీటి సరఫరా చేసే బోర్లు, పైపు లైన్లు, చేతి పంపులను పరిశీలించారు.

భూదాన్‌పోచంపల్లి : బీజేపీ చేనేత సెల్ జిల్లా కన్వీనర్‌గా భూదాన్‌పోచంపల్లికి చెందిన సీనియర్ నాయకుడు గంజి బస్వలింగాన్ని నియమిస్తూ గురువారం నియామకపత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా గంజి బస్వలింగం మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీబీనగర్: బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంబటి తరుణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

భువనగిరి రూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వల్దాసు రాజు కాళభైరవ అన్నారు. భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

భూదాన్‌పోచంపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో రైతులకు రుణమాఫీ, రైతు భరోసా కల్పించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్‌ను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

వలిగొండ, ఏప్రిల్ 4: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరెకంటి మొగులయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం, టిఫిన్ బైటక్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, అసెంబ్లీ కోకన్వీనర్ రాచకొండ కృష్ణ, జిల్లా నాయకులు సత్తయ్య, స్టేట్ కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్, ప్రధానకార్యదర్శి లింగస్వామి ఉన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ననుబోతు సైదులు మాట్లాడారు. బూర విజయానికి కృషి చేయాలని కోరారు.

మోత్కూరు: బీజేపీ బూత్ కమిటీలను పటిష్టపర్చాలని పార్టీ మునిసిపాలిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య, మండల అధ్యక్షుడు దీటి సందీప్ కోరారు. మోత్కూరులో, మండలంలోని పొడిచేడులో వేర్వేరుగా నిర్వహించిన బీజేపీ బూత్‌కమిటీ సభ్యుల సమావేశాల్లో వారు మాట్లాడారు.

భువనగిరి టౌన్: జిల్లా అంతటా టిఫిన్ పే చర్చ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్త తెలిపారు. భువనగిరిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా పార్టీ జెండాను ఎగురవేశాక టిఫిన్‌పే చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు పడమటి జగన్మోహన్‌రెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, జిల్లా ఉపాధ్యక్షులు పట్నం శ్రీనివాస్, నీలం రమేష్, ఉడుత భాస్కర్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రత్నపురం బలరాం, ఎంగిలి లక్ష్మణ్, ఎదగాని సంతోష్ పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దర్శనాల అంజయ్య

అడ్డగూడూరు, ఏప్రిల్ 4: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ దర్శనాల అంజయ్య అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కోటమర్తి, అడ్డగూడూరు ఎంపీటీసీలు పాశం యాదమ్మ, పెండ్యాల భారతమ్మ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీళ్లు తమ గ్రామాలకు సరిగా రావడం లేదని, వేసవి కాలంలో ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో గతంలో వ్యవసాయ శాఖ అధికారులు తేమ శాతాన్ని పరిశీలించి, కాంటాలకు అనుమతించినా రైస్ మిల్లర్లు, ఐకేపీ నిర్వాహకులు తేమ శాతంపేరుతో కోతలు విధిస్తున్నారని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. భూగర్భ జలాలు అడుగంటి వరి పొలాలు ఎండిపోయి అంతంత మాత్రమే ధాన్యం పండిందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు స్పందించి కోతలు విధించొద్దని అధికారులను కోరారు. తదనంతరం అన్ని శాఖల అధికారులు నివేదిక వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు శ్రీరాముల జ్యోతి, ఎంపీడీవో శంకరయ్య, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. గురువారం జిల్లాలోని పలు గ్రామాలు, మండల కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కృష్ణయ్య ప్రారంభించారు. ఎవరైనా దళారులు రైతులను మోసం చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఈవో బొడ్డుపల్లి శేఖర్, చిలువేరు శంకర్, యాదయ్య ,వెంకటేష్, రవి, రైతులు పాల్గొన్నారు.

- ఆత్మకూరు(ఎం) మండలంలోని మొరిపిరాల, సర్వేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో నిరంజన్ ప్రారంభించారు. ఏఎం ఫకీరయ్య, సీసీలు వెంకటేశ్వర్లు, భాస్కర్, ఏఈవో మనీషా పాల్గొన్నారు.
- గుండాల మండలంలోని అంబాల, నూనెగూడెం, కొమ్మాయిపల్లి, వెల్మజాల, బండకొత్తపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దార్ జయకుమారి, ఎంపీడీవో దేవిక, ఏపీఎం ఉన్నారు.
- మోత్కూరు మండలంలోని సదర్శాపురం, దాచారం, పాటిమట్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య ప్రారంభించారు. ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, ఏఈవో ఎం.అశోక్‌కుమార్, సీసీ లక్ష్మణ్ ఉన్నారు.
- మోటకొండూర్ మండలంలోని మేడికుంటపల్లి, దిలావర్‌పూర్, ఇక్కుర్తి, చామపుర్, కొండాపూర్, కదిరేనిగూడెం, కాటేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో ఇందిర ప్రారంభించారు. ప్రాజెక్టు అదనపు డైరెక్టర్ శ్రీనివాస్, ఏపీఎం సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి సుబ్బూరు సుజాత, సీసీలు మల్లేష్, సంతోష, రైతులు పాల్గొన్నారు.
- భూదాన్‌పోచంపల్లి పట్టణంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఏవో ఎజాజ్ అలీఖాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో బాల్‌రెడ్డి, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి సోని, రైతులు బాల్‌రెడ్డి, పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.
- వలిగొండ మండలంలోని నర్సాయిగూడెం, వేములకొండ, దుప్పల్లి, నర్సాపురం, నాగారం, తుర్కపల్లి, వెల్వర్తి, రెడ్లరేపాక, నాతాళ్లగూడెం, అక్కంపల్లి, లింగరాజుపల్లి, మాందాపురం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఏపీఎం జాని, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



వలిగొండ: వాగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి



మోటకొండూర్: కదిరేనిగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో ఇందిర



పోచంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు